సాక్షి చిత్తూరు

గురువారం । 30 । నవంబర్ । 2023



బాబు గారడీ నమ్మొద్దు

వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్ర బాబు నాయుడు ప్రకటిస్తున్న గారడీ పథకాలను నమ్మవద్దని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. - 8లో



పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు

ప్రభుత్వం పారిశ్రామికరంగం అభివృద్ధికి చర్యలు చేపడుతోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. - 8లో



చతుర్థి వ్రత ఆచరణతో కష్టాలు దూరం

సంకటహర చతుర్థి వ్రతం ఆచరిస్తే సకల కష్టాలు తొలగిపోతాయని నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు సార్లు వ్రతం నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం స్వామివారిని బంగారు రథంలో ఊరేగించనున్నట్లు తెలిపారు. వ్రతంలో పాల్గొనే భక్తులు టికెట్ ధర రూ.350 కొనుగోలు చేయాలన్నారు. వ్రతం ఆచరించే భక్తులకు పూజా సామగ్రిని ఆలయ అధికారులు అందించనున్నట్లు తెలిపారు.

కనకదాస్ జయంతి నేడు



డీడీ రబ్బానీబాషా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం కనకదాస్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కురబకులస్తులు, ప్రజలు విచ్చేయాలని ఆయన కోరారు.

తల్లీబిడ్డ సేవలపై అవగాహన అవసరం

చిత్తూరు రూరల్: గర్భిణులకు తల్లీబిడ్డ సేవలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీఎంహెచ్ ప్రభావతీదేవి అన్నారు. చిత్తూరులోని తన కార్యాలయం నుంచి ఆమె బుధవారం మండల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తల్లీబిడ్డ సంరక్షణ కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం విస్తృతం చేసిందన్నారు. హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలు అందించడానికి తల్లీబిడ్డ వాహనాన్ని వినియోగంలోకి తెచ్చిందన్నారు. ప్రసవానికి ఆస్పత్రిలో చేర్చేందుకు కూడా ఈ వాహనాన్ని వినియోగించుకోవచ్చన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. సేవలు వినియోగించుకునేలా చూడాలని చెప్పారు.

జగనన్న పాలవెల్లువ రెండో విడత ప్రారంభం రేపు

చిత్తూరు కలెక్టరేట్ : డిసెంబర్ ఒకటో తేదీన జగనన్న పాలవెల్లువ రెండో విడత కార్యక్రమం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 6 మండలాల్లో 103 గ్రామాల్లో రెండో విడతలో పాల సేకరణ జరుగుతుందన్నారు. ప్రభుత్వం రెండేళ్లుగా జిల్లాలోని వి.కోట, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పాడిరైతుల నుంచి పాలసేకరణ చేసి, లబ్ధి చేకూరుస్తోందన్నారు. తవణంపల్లె, ఐరాల, బంగారుపాళెం, కార్వేటినగరం, నగరి, నింద్ర మండలాల్లో రెండో విడత పాలసేకరణ ప్రక్రియ డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభమవుతుందన్నారు. అమూల్ సంస్థ పాడి రైతులకు గిట్టుబాటు ధరను ఇస్తోందని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్ మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 58,874 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 17,133 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.50 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు ఉన్న భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్న భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఆహా ఏమి రుచి..

సేవించు మైమరచి!



వేడి వేడి తేనీరు సేవిద్దాం.. చాయ్ చమక్కులు చూద్దాం అని ఓ సినీ కవి చెప్పినట్లు పేదా..గొప్పా తారతమ్యం లేకుండా అందరికీ ఇవి ఇష్టమైన పానీయాలే అంటే అతిశయోక్తి లేదు. పొద్దున లేవగానే ఓ గుక్కెడు టీ తాగందే ఏ పనీ చేయని వారు చాలా మందే ఉన్నారు. కాస్త తలనొప్పి వచ్చినా వెంటనే టీ..కాఫీల వైపే మొగ్గుచూపుతుంటారు. ఇంటికి అతిథులు వస్తే టీ..కాఫీతోనే స్వాగతం పలుకుతుంటారు. నలుగురు స్నేహితులు కలిస్తే తేనీటి విందుతోనే మాటలు మొదలుపెడుతుంటారు. ఒక్క కప్పు లోపల పడితే ఆ ఉత్సాహమే వేరబ్బా అంటూ టీ..కాఫీలను అన్ని వయసుల వారు ఆస్వాదిస్తుంటారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విభిన్నరీతుల్లో కాఫీ షాపులు వెలుస్తున్నాయి. ఫ్రాంచైజీలతో సరికొత్తగా టీ దుకాణాలు ఆహ్వానం పలుకుతున్నాయి.

కాఫీ ఘుమ ఘుమలు.. చాయ్ చమక్కులు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఫ్రాంచైజీ షాపులు
- స్పెషల్ టీ..కాఫీలకు భలే క్రేజ్
- వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టు తయారీ

సాక్షి, తిరుపతి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేలకు పైగా టీ షాపులున్నాయి. ఇందులో సొంతంగా యజమానులే నిర్వహించుకునే షాపులు 22 వేలకు వరకు ఉండగా 6వేల వరకు ఫ్రాంచైజీలతో నడుస్తున్నాయి. 2వేల మంది వరకు హోటళ్లు, చిల్లర దుకాణాల్లో టీ దుకాణాలు నడుపుకుంటున్నారు. గతంలో పట్టణ ప్రాంతాల్లో మాత్రమే ఈ టీ కొట్లుండేవి. కాలక్రమేణా ఇవి పెరుగుతూ వచ్చాయి. సాధారణ టీ షాపులతో పాటు.. రకరకాల టీ హబ్‌లు పుట్టుకొచ్చాయి. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా పెద్ద సంఖ్యలో షాపులు వెలిశాయి. విభిన్నంగా ఆకట్టుకునే అలంకరణలతో, ఫ్రాంచైజీల పేరిట కొత్త రకం టీ, కాఫీ షాపులు ప్రజలను కట్టిపడేస్తున్నాయి.

రకరకాల తేనీరు

ఒకప్పుడు టీ, కాఫీలను కొంత మంది మాత్రమే తాగేవారు. ఇప్పుడు 99 శాతం ఆనందంగా సేవిస్తున్నారు. రుచితో పాటు ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా టీ, కాఫీలు తయారు చేస్తున్నారు. సాధారణ టీ, బెల్లం టీ, అల్లం టీ, ఇరానీ టీ, గ్రీన్, లెమన్, వైట్, పిస్తా, బాదం, సొంటి-మిరియాలు, మసాలా, ధమ్ చాయ్ ఎన్నో వెరైటీలు అందుబాటులోకి వచ్చాయి. పేపర్ కప్పులతో పాటు మట్టి పాత్రలు, వివిధ రకాల డిజైన్ గాజు గ్లాసుల్లో టీ..కాఫీలను అందిస్తున్నారు. వీటితో పాటు కొత్తగా మునగాకు టీ, బొప్పాయి, తులసి, వేప, పుదినా, కాకరకాయ టీలతో పలువురిని ఆకర్షిస్తున్నారు.



ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన టీ దుకాణం

ఆకట్టుకునేలా షాపులు

మారుతున్న ప్రజల జీవనశైలికి అనుగుణంగా ఫ్రాంచైజీ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఆకట్టుకునేలా షాపులను తీర్చిదిద్దుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి మరీ ప్రసిద్ధి చెందిన టీ..కాఫీ షాపులను పలువురు ఫ్రాంచైజీ తీసుకుని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. చూడముచ్చటగా ఉండే ఈ దుకాణాల్లో తేనీటి రుచులను ఆస్వాదించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

మానవాళికి ప్రకృతి ప్రసాదించే ప్రతి ఒక్కటీ ఏదో రకంగా మేలు చేస్తుంది. తేయాకు అందుకు మినహాయింపు కాదు. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చిన తేయాకు.. నేడు మనదేశం నుంచే ఇతర దేశాలకు ఎగుమతి అవుతోంది. ప్రపంచ తేయాకు ఉత్పత్తిలో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. అంటే అటు ఉత్పత్తిలోనూ, ఇటు వినియోగంలోనూ టీ ఆకు మన సమాజంతో పెనవేసుకుపోయింది. వివిధ రకాల మూలికలతో ఉపయోగాలు ఉన్నట్లు ..తేయాకుతో కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పరిమితంగా టీ సేవిస్తే క్యాన్సర్ నిరోధకత పెరుగుతుందని ఓ పరిశోధనలో వెల్లడైంది. ఎంత తాగాలి అనిపించినా టీ..కాఫీలను పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చౌకగా లభిస్తుంది కదా అని కప్పుల కొద్దీ ఖాళీ చేస్తే అజీర్ణంతో పాటు నిద్ర లేమి వంటి ఇతర సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయని హెచ్చరిస్తున్నారు.



చాయ్ సేవిస్తున్న యువకులు



టీ కలుపుతున్న మహిళలు



ఆకట్టుకునేలా అలంకరణ

నిత్యావసరాల పంపిణీని పర్యవేక్షించాలి

చిత్తూరు కలెక్టరేట్ : నిత్యావసర వస్తువుల పంపిణీని రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో గత కొన్ని శతాబ్దాల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి సమతుల్య పోషకాలతో కూడిన నిత్యావసర వస్తువుల పంపిణీకి నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను అమలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇంటివద్దకు రేషన్ పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. మొబైలు వాహనాలతో ప్రజల ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు మొబైలు వాహనాల ద్వారా ప్రతి నెలా బియ్యం, గోధుమ పిండి, చిరుధాన్యాలు, చక్కెర, కందిపప్పు తదితర నిత్యావసర సరుకులను కార్డుదారుల ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించడం జరుగుతోందని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు అవకాశం లేకుండా చూసేందుకు రెవెన్యూ శాఖ అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వలంటీర్లు, ఎఫ్‌పీ షాపు డీలర్లతో ప్రతినెలా సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, క్లస్టర్ల వారీగా లోటుపాట్లను సవరించుకోవాలని ఆదేశించారు. ప్రతి 5 నుంచి 10 ఇళ్లకు ఒక ప్రదేశాన్ని నిర్దేశించుకుని నిత్యావసర సరుకుల పంపిణీ జరగాలన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద నిత్యావసర సరుకులను సరిగా తూకం వేసి ఇవ్వాలని తెలిపారు. వస్తువుల తూకంలో అవకతవకలుంటే సివిల్ సప్లయిస్ డీఎం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యం, చిరుధాన్యాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని వెల్లడించారు. కార్డుదారుల నుంచి అధిక ధరలను వసూలు చేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 4 రెవెన్యూ డివిజన్లలోని 31 మండలాల్లో 1,379 ఎఫ్‌పీ షాపుల పరిధిలో 5,41,678 తెల్లరేషన్ కార్డుదారులకు 336 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 2,131 పాఠశాలలు, 174 సంక్షేమ వసతిగృహాలు, 2420 అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రేషన్ పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎస్‌ఓ శంకరన్, సివిల్ సప్లయిస్ డీఎం మోహన్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, డీఈఓ విజయేంద్రరావు, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సంక్షేమం.. అభివృద్ధికి చిరునామా ఏపీ

- పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా
- పూడిలో మంత్రి పల్లెనిద్ర



పూడిలో పల్లెనిద్ర చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని, సంక్షేమానికి, అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా నిలిచిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం వడమాలపేట మండలం పూడి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా ఆ గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ముందుగా పూడి సచివాలయ ఆవరణలో నేటి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. అనంతరం కాయం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంతకం చేసిన క్షణం నుంచి రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనకు, 2019 నుంచి 2024 వరకు జగనన్న పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, అందుకు జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాలని తేల్చి చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం చేస్తోందన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి, ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. అదే జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని రాసిన బోర్డులను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్న జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరి నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, శాఫ్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, కాణిపాకం పాలకమండలి సభ్యురాలు ప్రతిమ, పార్టీ నాయకులు సురేష్‌రాజు, చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, మునిబాబు, ఉమాపతి, రామిరెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



పూడిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

కసరత్తు ముమ్మరం

అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటుహక్కు లేకుండా ఉండకూడదు.. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై వచ్చే ప్రతి అభ్యంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. పారదర్శకంగా ఓటర్ల జాబితాకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది.

- అభ్యంతరాల స్వీకరణకు తుది గడువు డిసెంబర్ 9
- ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- గత నెల 27 నుంచి ఈ నెల 23 వరకు 70,875 అభ్యంతరాలు
- క్షేత్రస్థాయిలో కసరత్తును పకడ్బందీగా పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్ల పరిశీలన పకడ్బందీగా సాగుతోంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి చర్యలు చేపడుతోంది. సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను అధికారులు పక్కాగా నిర్వహిస్తున్నారు. పాత ఓటర్ల జాబితా ముదింపు ప్రక్రియ తర్వాత సిద్ధం చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్)ను జారీ చేశారు. పారదర్శకమైన తుది ఓటర్ల జాబితాకు జిల్లా అధికారిక యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను అక్టోబర్ 27న విడుదల చేశారు. ఆ జాబితాలో అభ్యంతరాలను తెలియజేసేందుకు డిసెంబర్ 9 వరకు అవకాశం కల్పించారు. అందిన అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి కసరత్తును పర్యవేక్షిస్తున్నారు.



క్షేత్రస్థాయిలో కసరత్తును పర్యవేక్షిస్తున్న డీఆర్వో రాజశేఖర్

ప్రతి అభ్యంతరం క్షుణ్ణంగా పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 31 మండలాల పరిధిలో 1,726 పోలింగ్ కేంద్రాలున్నాయి. సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుతున్న ప్రతి అభ్యంతరాన్ని బీఎల్వోలు స్వయంగా ఓటర్ల వద్దకు వెళ్లి నిజమా? కాదా అని పరిశీలిస్తున్నారు. సంతృప్తి చెందిన అనంతరం వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తున్నారు. మార్పులు, చేర్పులు ఏమైనా ఉన్నట్లైతే అధికారులు సవరిస్తున్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు డిసెంబర్ 9వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

అభ్యంతరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	నమోదైన అభ్యంతరాలు
పుంగనూరు	262	13,166
నగరి	229	9,034
జీడీ నెల్లూరు	255	8,691
చిత్తూరు	226	8,449
పూతలపట్టు	260	10,189
పలమనేరు	287	12,863
కుప్పం	243	8,440
మొత్తం	1762	70,875

ఒకరికి ఐదు క్లైయిమ్‌లకే అవకాశం



ఒక వ్యక్తి 5 కంటే ఎక్కువ క్లైయిమ్‌లు ఇవ్వడానికి వీల్లేదు. అలా ఎక్కడైనా ఇస్తే క్రిమినల్ కేసులు పెడతారు. డిసెంబర్ 9వ తేదీలోపు వచ్చే ప్రతీ దరఖాస్తు, అభ్యంతరాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. వచ్చే ప్రతి అభ్యంతరాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించడం జరుగుతోంది. ఎన్నికల నిబంధనల మేరకు కసరత్తు పకడ్బందీ చేపడుతున్నాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి



కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాం. క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. డిసెంబర్ 2,3 తేదీల్లో బూత్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఒకే డోర్ నంబర్‌లో 10 మంది ఓటర్లు ఉన్నట్లైతే పకడ్బందీగా పరిశీలిస్తున్నాం. ఫారం-6, 7, 8 పెండింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. తుది ఓటర్ల జాబితా జనవరి 5న విడుదల చేస్తాం.

– శ్రీనివాసులు, జాయింట్‌కలెక్టర్, చిత్తూరు

అర్హులందరికీ ఓటుహక్కు కల్పించేలా..

ఈ సారి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు ఎన్నికల యంత్రాంగం శ్రమిస్తోంది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ నెలలో రెండు రోజుల పాటు బూత్ స్థాయిలో క్యాంపులు ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. ఇదే స్ఫూర్తితో చివరిసారిగా డిసెంబర్ 2, 3 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించే బాధ్యతను బీఎల్వోలకు అప్పగించారు. ఈ ప్రక్రియను సంబంధిత ఈఆర్వోలు పర్యవేక్షించనున్నారు. డోర్ టూ డోర్ సర్వే సమయంలో వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నారు. గత నెల 27న ముసాయిదా ప్రకటించినప్పటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు 70,875 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో 68,400 అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించారు. మిగిలిన 2,475 అభ్యంతరాలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పేదలకు గృహయోగం

సొంతిల్లు కట్టుకోవాలి..అందులో కుటుంబంతో హాయిగా ఉండాలన్నది నిరుపేదల కల. సొంతిల్లు ఎలా కట్టుకోవాలని పరితపించే పేదల తలరాతలు మార్చాలి.. వారిని ఉన్నత స్థాయికి తీసుకురావాలి.. వారికి సొంత గూడు కట్టి ఇవ్వాలన్న ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ–ఇల్లు పథకాన్ని ప్రారంభించారు. గత పాలకుల్లా కాకుండా ఇచ్చిన మాటను చేతల్లో చేసి చూపించారు. పేదలందరికీ గృహయోగం కల్పించారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఆనందం వారి మాటల్లోనే.. –చిత్తూరు కలెక్టరేట్

జనవాక్కు



ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇల్లు

మా కంటూ స్థిరమైన చిరునామా కల్పించారు



నా భర్త నేత కార్మికుడు. నాలుగు దశాబ్దాలుగా అద్దె ఇంట్లోనే ఉన్నాం. కొన్నేళ్లు ఒక ప్రాంతంలో నివాసం ఉంటే, ఇంకొన్నేళ్లు మరోచోట ఉండాల్సిన పరిస్థితి. ఇలా స్థిరమైన చిరునామా లేక ఎక్కడా మా స్తోమతకు తగ్గ ఇల్లు అద్దెకు దొరకకపోవడంతో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. గతంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ఏ ప్రభుత్వంలోనూ స్థలం ఇవ్వలేదు. ఈ సర్కారు పాలనలో సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విలువైన ఇంటి స్థలంతో పాటు సొంతంగా ఇల్లు కట్టించుకునేందుకు ఆర్థిక సహాయం చేశారు. సీఎం పుణ్యమా అని నేడు మాకంటూ సొంతంగా ఇల్లు, మాకంటూ ఒక చిరునామా దొరికింది. సీఎం మేలు ఎప్పటికీ మరిచిపోం.

– రాజేశ్వరి, కొత్తపేట, నగరి మునిసిపాలిటీ.

ఇది జగన్‌ ఇచ్చిన ఆనందం



తినేందుకు తిండి లేక.. ఉండేందుకు గూడు లేక.. బీడీలు చుట్టి జీవనం సాగించాం. బతికి ఉన్నంతవరకు సొంత ఇల్లు కట్టుకోలేమన్న నిరాశతో 60 ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే ఉంటూ పిల్లలను చదివించడానికి కష్టపడ్డాం. నేడు నా బిడ్డ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయతో సొంతిల్లు కట్టుగోగలిగాం. ఆయన దయవల్లే ఈ రోజు మేము సొంత ఇంట్లో ఉండగలుగుతున్నాం. ఈ ఆనందం ఆయన ఇచ్చినదే. గతంలో మా పరిస్థితులు పట్టించుకున్న నాథుడే లేడు. నేడు ప్రభుత్వ చలవతో మాకంటు సొంత గూడు ఏర్పడింది.

– రాణమ్మ, మునుస్వామి దంపతులు, కార్వేటినగరం

కల నెరవేరింది



నా చిన్నతనం నుంచి సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటూ బాడుగ కట్టలేక, ఇబ్బందులు పడిన రోజులెన్నో ఉన్నాయి. నేను అగ్రవర్ణానికి చెందడంతో సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత లేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇల్లు లేదని ఎన్ని వినతులిచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అగ్రవర్ణాల పేదలకు సంక్షేమ పథకాలు ఇచ్చారు. వలంటీర్‌ మోహన్‌ మా వివరాలన్నీ తీసుకుని దరఖాస్తు చేశాడు. ఇల్లు మంజూరయ్యింది. చెప్పగానే మా ఆనందానికి అవధుల్లేవు. ప్రభుత్వ సహాయంతో ఇల్లు కట్టుకున్నాను. దీంతో నా కల నెరవేరింది.

– వరలక్ష్మి, శ్రీధర్‌వర్మ, కార్వేటినగరం

15 ఏళ్లుగా ఇల్లు కట్టుకోలేకపోయాం



నాకు పెళ్లై 15 ఏళ్లవుతుంది. మాది ఉమ్మడి కుటుంబం. నా భర్త కుప్పారెడ్డి సేద్యం చేస్తారు. మా ఇద్దరు పిల్లలు స్థానిక ప్రభుత్వ స్కూల్‌లో చదువుతున్నారు. పది మంది ఒకే ఇంట్లో ఉండేవారం. విడివిడిగా రేషన్‌ కార్డులున్నా నివాసం ఒకటే ఉండేది. కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి స్తోమత లేకపోవడంతో అందరం సర్దుకుపోయేవారం. ఈ దశలో అందరికీ ఇల్లు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వలంటీర్‌ మా ఇంటి వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే స్థలమిచ్చి ఇల్లు కట్టిస్తారని తెలిపాడు. దరఖాస్తు చేసుకున్నాం. ఎలాంటి సిఫారసు లేకుండా పట్టా వచ్చింది. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు సాయం అందించారు. నేడు ఇల్లు కట్టుకున్నాం.

– మల్లేశ్వరి, అత్తూరు, నింద్ర మండలం

ఉపసర్పంచ్‌ కుటుంబానికి చేయూత



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా

- కష్టాల్లో ఉన్న కుటుంబంలో వెలుగులు నింపిన ప్రభుత్వం
- రూ.10 లక్షలు సీఎం సహాయనిధి అందజేత

నగరి : కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి ప్రభుత్వం చేయూత నిచ్చింది. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భర్త చనిపోవడంతో ఆరో తరగతి చదువుతున్న పిల్లవాడి ఆలనాపాలన, వయోవృద్ధులైన అత్తమామల పోషణ భారమంతా ఆ ఇల్లాలిపై పడింది. ఆర్థికంగా చితిపోవడంతో ఉన్న కాస్త పొలంలో వ్యవసాయంతోనే కుటుంబాన్ని పోషించాల్సిన గత్యంతరం ఏర్పడింది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న మంత్రి ఆర్కేరోజా సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయించి, కష్టాల చీకట్లు కమ్ముకుంటున్న ఆ కుటుంబంలో వెలుగును నింపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అడవికొత్తూరులో వైఎస్సార్‌ సీపీకి చెందిన వైస్‌ సర్పంచ్‌ వెంకటేశ్‌ మూడు నెలల క్రితం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆకస్మికంగా అతను మరణించడంతో అతని కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. కుమారునితోపాటు అత్తమామలను చూసుకునే బాధ్యత వెంకటేశ్‌ భార్య అముదపై పడింది. అప్పటివరకు ఇంటికే పరిమితమైన ఆమె వ్యవసాయ పనులకు వెళ్లి కుటుంబ పోషణ చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కుటుంబ పోషణ, అత్తమామల ఆస్పత్రి ఖర్చుల పెనుభారం మోయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా తానున్నానంటూ ఆమెకు భరోసా ఇచ్చారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి సహాయనిధి విభాగానికి అముద పరిస్థితిని వివరించి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం తన నివాసం వద్ద అముదకు సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఆపదలో ఆపన్నహస్తం అందించిన మంత్రికి అముద కన్నీటితో కృతజ్ఞతలు తెలిపింది. ఈ సాయం మరువలేనిదంటూ నమస్కరిస్తూ తన భావాన్ని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్‌ బుజ్జిరెడ్డి, నాయకులు భాస్కర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే భూస్థాపితం



సదుం: సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీని ప్రజలే భూస్థాపితం చేస్తారని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గతంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఆయన తండ్రి రామకృష్ణారెడ్డి 30 ఏళ్లు ప్రజాప్రతినిధులుగా పనిచేశారని, అయితే పుంగనూరు నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం ఒక్కటైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. జిల్లావాసులై ఉండి, సీఎంలుగా పని చేసిన కిరణ్‌, చంద్రబాబు రాయలసీమలో ఒక ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయలేదని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో తంబళ్లపల్లెలో ముదివేడు, పుంగనూరు నేతిగుట్ట, సోమల ఆవులపల్లె ప్రాజెక్టులను రూ.2 వేల కోట్లతో నిర్మిస్తుంటే కుయుక్తులు పన్ని టీడీపీ నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. జిల్లాతో పాటు, నియోజకవర్గంలో ఇప్పుడిప్పుడే పరిశ్రమల స్థాపనకు పలువురు ముందుకు వస్తున్నారని తెలిపారు. పుంగనూరులో సిలిండర్లు, పైపుల పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి కృషి చేశారని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో పెప్పర్‌ ఎలక్ట్రిక్‌ బస్సుల పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. కానీ మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, చల్లా బాబు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు సుముఖత చూపిన రైతులను సైతం రెచ్చగొట్టి అడ్డంకులు సృష్టిస్తున్నారని చెప్పారు. పరిశ్రమలను ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేయడం లేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే చేస్తున్న విషయాన్ని వారు గుర్తించాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటైతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, మంత్రికి, ఎంపీకి ఎక్కడ మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే టీడీపీ నాయకులు నీతిమాలిన చర్యలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంత్రిగా పని చేసిన అమర్‌ కియా పరిశ్రమ ఏర్పాటుకు ముడుపులు తీసుకోవడం నిజం కాదా? అని ప్రశ్నించారు. పుంగనూరులో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులు ఉండడంతోనే పలువురు ముందుకు వస్తున్నట్టు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాల్సింది పోయి, అడ్డుపడుతుండడంతో టీడీపీ నాయకుల నైజం ఏమిటో అర్థం అవుతోందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, టీడీపీకి తగు గుణపాఠం చెబుతారని చెప్పారు. కార్యక్రమంలో కో–ఆప్షన్‌ సభ్యుడు ఇమ్రాన్‌, నాయకులు పుత్రాజు, రమేష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీరాములు, మురగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బాబు గారడీ నమ్మొద్దు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్‌

గుడుపల్లె: వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబు నాయుడు ప్రకటిస్తున్న గారడీ పథకాలను నమ్మవద్దని వైఎస్సార్‌ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్‌ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని ఓఎన్‌ కొత్తూరులో నిర్వహించిన వైఏపీ నీడ్స్‌ జగన్‌ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలో పార్టీ జెండా, పంచాయతీలో చేసిన అభివృద్ధి పనుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత గత నాలుగున్నరేళ్లలో వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమానికి నియోజకవర్గంలో రూ.కోట్లు ప్రభుత్వం వ్యయం చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ నవరత్న పథకాల ఫలాలు ఇళ్ల ముంగిటకే అందిస్తోందన్నారు. ఇదే గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే అందేవని, అది కూడా అధిక భాగం పార్టీ కార్యకర్తల జేబుల్లోకి వెళ్లేవన్నారు. తమ ప్రభుత్వం పాలనలో ఈ తేడాను ప్రజలు స్పష్టంగా గమనించవచ్చన్నారు. గతంలో చంద్రబాబు ఎన్నికల్లో గెలిచేందుకు 200 హామీలు ఇచ్చారని, గెలిచిన తర్వాత ఆ హామీలు గాలికొదిలేసి ప్లేటు ఫిరాయించారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ ప్రజలను వంచించేందుకు సిద్ధమయ్యారని, ఇంటింటా గ్యారంటీ కరపత్రాలు ఇచ్చి మోసం చేస్తారన్నారు. చెప్పిన మాట నిలబెట్టుకున్న జగనన్నను ఆదరిస్తే అందరూ బాగుపడడంతోపాటు పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌ సీపీని ఆదరించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్‌ రామకృష్ణమూర్తి, సర్పంచ్‌ దేవప్పనాయుడు, వైస్‌ ఎంపీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికరంగం అభివృద్ధికి చర్యలు చేపడుతోందని జెడ్పీ చైర్మన్‌ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి పలు పరిశ్రమలకు వర్చువల్‌ విధానంలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్‌ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌ సీపీ సర్కారు పరిశ్రమలను అభివృద్ధి చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలోని చిత్తూరు రూరల్‌ మండలంలో 5 వెంకటాపురం వద్ద రూ.14.30 కోట్ల నిధులతో కొత్త ఇండస్ట్రియల్‌ పార్క్‌ అభివృద్ధి పనులను వర్చువల్‌లో సీఎం ప్రారంభించారన్నారు. నూతన ఇండస్ట్రియల్‌ పార్కు 67.91 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తమ సర్కారు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. నూతన పరిశ్రమల ఏర్పాటుతో ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ షణ్మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు



ఏనుగులు తొక్కినాశనం చేసిన వరిపంట

బైరెడ్డిపల్లె: మండలంలోని వెంగంవారిపల్లె అటవీ సమీప పొలాల్లో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేసి, వరి, బీన్స్‌, టమాట పంటలను ధ్వంసం చేశాయి. వెంగంవారిపల్లె గ్రామానికి చెందిన భాస్కర్‌ సాగు చేసిన 2 ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే వెంకటేష్‌ సాగు చేసిన టమాట, రత్నప్పకు చెందిన బీన్స్‌ పంటలను ధ్వంసం చేశాయి. పంటలు చేతికందే సమయంలో ఏనుగుల గుంపు తొక్కినాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పవన్‌కళ్యాణ్‌ మృతదేహం

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంభూపాల్‌ కథనం మేరకు.. వి.కోట మండలం చింతలగుంట గ్రామానికి చెందిన కుమారరాజా కుమారుడు ఆర్‌.పవన్‌కళ్యాణ్‌(25) మంగళవారం రాత్రి పూతలపట్టు మండలంలోని రంగంపేట ఫ్లైఓవర్‌ వద్ద సర్వీసు రోడ్డును దాటుతుండగా అటువైపు వెళుతున్న కారు ఢీకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ అస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పవన్‌కళ్యాణ్‌ మృతికి కారణమైన వ్యక్తి పాకాల మండలానికి చెందిన హరినాథ్‌గా గుర్తించినట్లు తెలిపారు. పవన్‌కళ్యాణ్‌ తండ్రి కుమారరాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నవ వధువు మృతి

తిరుమల : తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి ఓ నవ వధువు మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. తిరుమల వన్‌ టౌన్‌ ఎస్‌ఐ సుధాకర్‌ కథనం మేరకు.. విజయవాడ చెందిన రమేష్‌, సుధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు . పెద్ద కుమార్తె సంతోషికి ఈనెల 23వ తేదీన హైదరాబాద్‌కు చెందిన యువకుడితో వివాహమైంది. నూతన వధూవరులు శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు నవ దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు రాగానే సంతోషి హఠాత్తుగా కళ్లు తిరిగి పడిపోయింది. టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రిలోని అపోలో ఎమెర్జెన్సీ క్లినిక్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సంతోషి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుంటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని రాత్రి 7 గంటలకు టీటీడీ అంబులెన్స్‌లో వారి స్వస్థలానికి తరలించారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తాం : ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తానని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. బుధవారం పలమనేరు న్యాయవాదుల సంఘం అధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు ఎదురుగా ఉన్న మెయిన్‌ రోడ్డులో ప్రజల కోసం రెండు బస్సు షెల్టర్లు, న్యాయవాదుల కోసం ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రూ.7.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కోర్టులో లైబ్రరీని ఏర్పాటు చేస్తామని, అందుకు కావాల్సిన పుస్తకాలను బైరెడ్డిపల్లెకు చెందిన హైకోర్టు న్యాయవాది కేజీ కృష్ణమూర్తి అందజేస్తారని తెలిపారు. న్యాయవాదులు ఈ సందర్భంగా ఆయన్ని ఇంటి స్థలాల గురించి అడగ్గా బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు లక్ష్మీపతి, కార్యదర్శి భరత్‌, న్యాయవాదులు పరమ శివప్ప, మోహన్‌రెడ్డి, ఇస్మాయిల్‌, రంజిత్‌ షా తదితరులు పాల్గొన్నారు.

చతుర్థి వ్రత ఆచరణతో కష్టాలు దూరం

- బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి



బాల బ్రహ్మానంద స్వామికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్‌ మోహన్‌ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో నిర్వహించే సంకటహర చతుర్థి వ్రతం ఆచరిస్తే సకల కష్టాలు తొలగిపోతాయని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన నైమిషారణ్య పీఠం, హిందూధార్మిక సేవా సమతి పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి తెలిపారు. ఉదయం వినాయక స్వామివారి దర్శనార్థం విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్‌ మోహన్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బాల బ్రహ్మానందస్వామి కల్యాణ వేదికలో స్వామివారి సంకటహర చతుర్థి వ్రతంపై ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. దేశంలోనే స్వయంభువుగా వెలిసి, భక్తుల కోర్కెలను తీరుస్తున్న ఏకైక వినాయక స్వామి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో వెలిశారన్నారు. ఈ ఆలయంలో పౌర్ణమి తరువాత నాలుగో రోజు నిర్వహించే సంకట హర చతుర్థి వ్రతంలో పాల్గొని, వ్రతం ఆచరించిన భక్తులు.. సకల కష్టాలు తొలగిపోయి సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. ఇలాంటి వ్రతాన్ని భక్తులు తప్పకుండ ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌ రెడ్డి, సూపరింటెండెంట్‌ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్‌ బాబు, విఘ్నేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం రాయాలంటే పాండిత్యం ఉండాలి

తిరుపతి సిటీ: సంస్కృతం కంటే తెలుగు భాషలో కవిత్వం రాయడం కష్టతరమని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్య కొంపెల్ల రామ సూర్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఎస్వీయూ సెనేట్‌ హాల్‌లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో జాస్తి సూర్యనారాయణ ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత సాహిత్యం–ఉత్తర రామ చరిత వైశిష్ట్యం అనే అంశంపై కార్యక్రమాన్ని ఆయన ఇన్‌ చార్జి వీసీ ఆచార్య జీఎం సుందరవల్లితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో కవిత్వం రాయాలంటే సంస్కృతం, తెలుగు భాషల్లో పాండిత్యం ఉండాలన్నారు. వేదం భారతీయ సాహిత్యానికి నీటి చెలమని, పురాణ సాహిత్యం ప్రేమ మయమని, కావ్యాలు రసమయమని అన్నారు. భవభూతి రాసిన ఉత్తరరామచరితం కరుణరస భరితమైందని, ఏకో రసం : కరుణమేవ అనే విధంగా కవి మలిచారని అన్నారు. సీతారాముల పరస్పర అనురాగాన్ని, అరమరికలు లేని దాంపత్య జీవితాన్ని మనస్సును తాకే విధంగా వివరించారు. తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య ఆర్‌.రాజేశ్వరమ్మ, ప్రొఫెసర్లు శ్రీనివాసులు రెడ్డి, దామోదరనాయుడు పాల్గొన్నారు.